క్లుప్తంగా

నేడు డిగ్రీ మొదటి సెమిస్టర్ మూల్యాంకనం

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో 2024–25 విద్యాసంవత్సరం డిగ్రీ మొదటి సెమిస్టర్ మూల్యాంకనం శనివారం జరుగుతుందని ప్రిన్సిపాల్, క్యాంప్ ఆఫీసర్ ఎన్.మురళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఎక్సామినర్లు తమ యూనివర్సిటీ స్క్రిప్ట్ వాల్యూయేషన్ ఐడీ, రిలీవింగ్ సర్టిఫికెట్‌తో శనివారం ఉదయం 10 గంటలకు స్పాట్ వాల్యూయేషన్ క్యాంపులో హాజరుకావాలని తెలిపారు.

గోవులకు రక్షణ కల్పించాలి



వినతి పత్రం అందజేస్తున్న గో పరిక్షరక్షణ సమితి సభ్యులు

చీరాల రూరల్: పట్టణంలో రోడ్ల సంచరించే అనాథ గోవులకు మున్సిపల్ స్థలాల్లో రక్షణ కల్పించాలని గోపరిరక్షణ సమితి సభ్యులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. నిత్యం రోడ్ల వెంట రక్షణ లేకుండా తిరుగుతున్న గోవుల పట్ల కొందరు కర్కశంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. త్వరలో గోవులకు రక్షణ నిమిత్తం స్థలం కేటాయిస్తామని కమిషనర్ తెలిపారని సమితి సభ్యులు పేర్కొన్నారు.

యునిక్ నంబర్ రిజిస్ట్రేషన్‌తో ఉపయోగం



కొణిదెనలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలిస్తున్న కుమారి

బల్లికురవ: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరంగా రైతులకు అందే సబ్సిడీలు, ప్రోత్సాహకాలు పొందేందుకు యునిక్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి కోరారు. శుక్రవారం బల్లికురవ, కొణిదెన రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న ఆ ప్రక్రియను పరిశీలించారు. ఈనెల 25 లోపు పూర్తి చేసుకోవాలన్నారు.

మృత వీరులకు క్యాండిల్ ర్యాలీతో నివాళి



ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న భారత సీఆర్‌పీఎఫ్ జవాన్లపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చీరాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గట్టు లక్ష్మీ మణికంఠ మాట్లాడుతూ 2019లో జమ్మూ, కాశ్మీర్‌లో ఉగ్రవాద ముష్కరులు భారత సీఆర్‌పీఎఫ్ కాన్వాయిపై ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారన్నారు. ఈ దాడిలో వీర మరణం పొందిన జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని, వారిని స్ఫూర్తిగా తీసుకొని ఈ దేశానికి విద్యార్థులు రక్షణగా నిలబడాలన్నారు. కన్నం రెడ్డి వెంకటేష్, నక్కల తరుణ్, గట్టు మురళికృష్ణ, నక్కల చందు, పుంజల డీన్ తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు



మల్లాయపాలెంలో కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్

బల్లికురవ: పాఠశాలల్లో ఉండాల్సిన 14 ఏళ్ల లోపు బాలలను పనుల్లో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ రవినాయక్ హెచ్చరించారు. శుక్రవారం పాతమల్లాయపాలెం గ్రామంలో కొణిదెన వెంకటప్పయ్య తన గొర్రెలను మేపేందుకు గుంటూరు ప్రాంతానికి చెందిన 12 సంవత్సరాల బాలుడిని సంవత్సరం నుంచి బాలకార్మికుడిగా మార్చినట్లు తెలుసుకున్నారు. వెంటనే గ్రామానికి వారితో మాట్లాడారు. తక్షణమే బాలుడ్ని గొర్రెల కాపరి పని నుంచి విముక్తి కల్పించి స్వగ్రామానికి పంపాలని ఆదేశించారు. డీటీ ప్రహర్ష, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిహరెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నాయకుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

వేటపాలెం: పందిళ్లపల్లి, చల్లారెడ్డిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం రూరల్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారు. ఈమేరకు రూరల్ ఏఈ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. కొత్తపేట, కొత్తరెడ్డిపాలెం, అక్కాయిపాలెం, లక్ష్మీపురం, పొట్టి సుబ్బయ్య పాలెం, కఠారివారిపాలెం గ్రామాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

గ్రామాలు చెత్త ఆవాసాలు



ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్తకుప్ప



గవినివారిపాలెంలో ఇలా..

- అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ
- ఎక్కడ చూసినా చెత్త కుప్పలే..
- ప్రత్యేకాధికారుల శీతకన్ను

చీరాల టౌన్: తీర ప్రాంతమైన చీరాల మండలం అపరిశుభ్రతకు ఆనవాలుగా మారుతోంది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. 15 గ్రామ పంచాయతీలకు గాను రెండ మినహా మిగిలిన చోట్ల పారిశుద్ధ్య కార్మికులు కొరత వేధిస్తోంది. గ్రామ పర్యటనల నిమిత్తం జిల్లా అధికారులో.. ప్రజాప్రతినిధులో వస్తే మాత్రం అప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో ఓ మోస్తరుగా శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిస్తున్నారు. దేవాంగపురి, ఈపూరుపాలెం, గవినివారిపాలెం గ్రామాల్లో జనాభాతో పాటు పంచాయతీల ఆదాయం కూడా దండిగా ఉంటుంది. కానీ ఈ గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బంది అరకొరగా ఉండటంతో వీధుల వెంట చెత్తాచెదారం కనిపిస్తూనే ఉంది. చీరాల మున్సిపాలిటీకి చేరువగా ఉన్న రామకృష్ణాపురం, సాల్మన్ సెంటర్ పంచాయతీలు చిన్నవైనప్పటికీ ఆదాయం ఉంటుంది. అయితే ఈ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యం. ప్రధాన రహదారులే కాదు అంతర్గత రహదారులనూ పట్టించుకొనేవారు కానరావడంలేదు. ఎంపీడీఓ, ఈవోఆర్డీ, మండల విద్యాశాఖాధికారి, మండల వ్యవసాయాధికారి, సీడీపీవోలను.. గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా కలెక్టర్ నియమించారు. కానీ వారానికి ఒక్కసారి కూడా వీరంతా గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని అంతా విమర్శిస్తున్నారు. జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో, మంచినీటి పంపుల వద్ద చెత్తకుప్పలు పేరుకుపోవడంతో పాటు తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. అంతేగాక ఈ ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందడం వలన రోగాల పాలవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల వెంట ఉన్న చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లించాల్సిన పారిశుద్ధ్య పర్యవేక్షకులు మొక్కుబడిగానే పని చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రత్యేకాధికారులు వీరే..

చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా మండల స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశాలతో నియమించారు. బుర్లవారిపాలెం, ఈపురుపాలెం, దేవాంగపురి గ్రామ పంచాయతీలకు ఎంపీడీఓ శివసుబ్రమణ్యం, పిట్టువారిపాలెం, తోటవారిపాలెం, గవినివారిపాలెం, దేవినూతల గ్రామ పంచాయితీలకు ఈవోఆర్డీ ఎ.రామకృష్ణ, కొత్తపాలెం, విజయనగర్‌కాలనీ గ్రామ పంచాయతీలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నక్కల నాగరాజు, రామకృష్ణాపురం, కావూరివారిపాలెం పంచాయతీలకు సీడీపీఓ కె.ఉమ, చీరాలనగర్, సాల్మన్‌సెంటర్ గ్రామ పంచాయతీలకు పి.సుబ్రమణ్యేశ్వరరావు ఎంఈవో.. గాంధీనగర్, వాడరేవు గ్రామ పంచాయతీలకు ఐ.సుమతీ మండల వ్యవసాయాధికారిలను ప్రత్యేకాధికారులగా నియమించారు.

> **సిబ్బంది లేక ఇబ్బంది**
>
> గ్రామాల్లో చెత్తకుప్పలు తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు సరిపడా లేరు. అయితే ఉన్నంతమంది సిబ్బందితోనే సమస్యను పరిష్కరిస్తున్నాం. వీధుల వెంట చెత్తాచెదారాలు వేయకుండా ప్రత్యేక కార్యక్రమం చేపట్టబోతున్నాం. ప్రజలు డస్ట్‌బిన్లు వినియోగించడంతో పాటు నివాస ప్రాంతాల్లో చెత్తకుప్పలుగా పేర్చవద్దు. సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తాం. ప్రత్యేకాధికారులు కూడా గ్రామాలును సందర్శించేలా కృషి చేస్తాం.
>
> – పి.శివసుబ్రహ్మణ్యం, చీరాల ఎంపీడీఓ

తల్లీబిడ్డల సంరక్షణ ముఖ్యం



కొప్పరపాడులో మాట్లాడుతున్న సీడీపీఓ



మార్టూరు: శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



కొడవలివారిపాలెంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మార్టూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ్ భీ.. పఢాయి భీ పథకం ద్వారా తల్లీ బిడ్డల సంరక్షణతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోగలమని ఐసీడీఎస్ పర్చూరు ప్రాజెక్టు సూపర్‌వైజర్ కె. పద్మ అన్నారు. మార్టూరులో రెండో రోజు జరిగిన శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ పథకంలో వెయ్యి రోజుల కార్యాచరణ పథకం ద్వారా స్త్రీ గర్భం దాల్చినప్పటి నుంచి పుట్టిన బిడ్డకు 23 నెలలు నిండే వరకు నిరంతర పర్యవేక్షణలో ఉంటారని తెలిపారు. ఏఎన్ఎం శారద అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాల టౌన్: గర్భిణులు విధిగా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల, సలహాలు పాటిస్తే ప్రసవాలు సాధారణంగా జరగడంతో పాటు తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్షా యోజన పథకంలో గ్రామంలోని గర్భిణులకు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలను చేశారు. వైద్యులు మాట్లాడుతూ గర్భిణులు 20 రోజులకు ఒకసారి విధిగా వైద్యుల వద్ద సేవలు పొందాలన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు పాలు, గుడ్లు, ఆకుకూరలు, బెల్లం విధిగా రోజువారీ ఆహారంలో ఉంచుకోవాలన్నారు. ప్రసవాలు జరిగేంత వరకు గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా చూసుకోవాలని, గర్భిణుల ప్రసవాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా పథకాలు రూపొందించిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలున్నారు.

కారంచేడు: శరీరానికి అవసరమైన పోషక పదార్థాలు మెరుగ్గా అందినప్పుడు చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం మెరుగవుతుందని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శాలిని అన్నారు. శుక్రవారం కొడవలివారిపాలెంలో నిర్వహించిన పోషణ్ బీ- పఢాయిబీ నినాదంతో గ్రామంలో జరుగుతున్న శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. రక్తహీనత లేకుండా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు సునీత, హిమబిందు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్లికురవ: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే 4 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారులను తల్లిలా లాలిస్తూ ఆటపాటలతో ఒత్తిడిలేని విద్యను అందించాలని ఐసీడీఎస్ సంతమాగులూరు సీడీపీఓ డి. సుధ కోరారు. కొప్పరపాడు, సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులో జరిగిన సదస్సులో మాట్లాడారు. చిన్నారులకు ప్రతిరోజూ మంచి పౌష్టికాహారం అందిస్తూ వారి ఎదుగుదలకు కొలతలు తీసి పర్యవేక్షించాలన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ భాస్కర్

చీమకుర్తి రూరల్: వ్యవసాయ భూమి గల ప్రతి రైతుకూ ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్య ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరంగా పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు మండల వ్యవసాయ అధికారి డీవీ భాస్కర్ తెలిపారు. అందుకోసమే రైతులకు 11 నంబర్లతో కూడిన విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను శుక్రవారం చీమకుర్తి మండలంలోని బూదవాడ సచివాలయంలో ఆయన పరిశీలించారు. రైతులంతా తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ గుర్తింపు సంఖ్య పొందాలన్నారు. ఇకపై అన్ని పథకాలకు ఇదే కీలకంగా మారుతుందన్నారు. విశిష్ట సంఖ్య నమోదు చేసుకున్న రైతులు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మపోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం వంటి పథకాల ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉంటుందన్నారు. గ్రామ సచివాలయంలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి ఈ సంఖ్య పొందవచ్చన్నారు. ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకుని రైతు సేవా సిబ్బందిని కలిస్తే విశిష్ట సంఖ్య పొందవచ్చన్నారు.

పాతతరం మందులతో తామర పురుగు నివారణ



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి

సంతమాగులూరు(అద్దంకి): పాత తరానికి చెందిన పరుగు మందుల పిచికారీతో తామర పురుగు అరికట్టవచ్చని మార్టూరు ఉద్యానవన శాఖ అధికారి హనుంతు నాయక్ అన్నారు. శుక్రవారం మిరప, బొప్పాయి వంటి పంటలను పరిశీలించారు. కొమ్మాలపాడు, మామిళ్లపల్లి గ్రామాల్లో రైతులకు తగు సూచనలు ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం



స్వామివారు, అమ్మవార్ల కళ్యాణ క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు

ఒంగోలు మెట్రో: స్థానిక కర్నూలు రోడ్డులోని గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి 17వ వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇంకొల్లు మధుసూదనాచార్య పర్యవేక్షణలో గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను పుష్పాలతో అలంకరించి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు పేలప్రోలు రామకృష్ణ పరమహంస బిర్లా, పేలప్రోలు బ్రహ్మానందం దంపతులు, వారి కుటుంబ సభ్యులు కళ్యాణ ఉభయదాతలుగా వ్యవహరించారు. అర్చకుల మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ అట్టహాసంగా స్వామివారి కళ్యాణం సాగగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం కళ్యాణానికి విచ్చేసిన భక్తులకు రుత్వికులు వేద ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రుత్వికులు నల్లపాటి కుమారస్వామి, ఏల్చూరి ప్రదీప్‌శాస్త్రి, పాలెపు వెంకటేశ్వరశర్మ, నూతలపాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

బల్లికురవ: రైతులకు సంబంధించి ఎలాంటి భూసమస్యలున్నా సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ రవీ నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వేమవరం గ్రామంలో జరిగిన గ్రామసభలో మాట్లాడారు. గ్రామానికి చెందిన రైతులకు సంబంధించిన పంటపొలాలు ఎన్నెస్పీ జాయింటా ఖాతాలో చూపించటం పట్ల పంట రుణాలు బంగారు రుణాలు పొందలేకపోతున్నామంటూ రైతులు ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులు రైతులు విన్నవించారు. దీంతో ఎన్నెస్పీ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. డీటీ ప్రహర్ష, ఆర్ఐ పోతురాజు, సర్పంచ్ డీబీ సుబ్బయ్య చౌదరి పాల్గొన్నారు.



వేమవరంలో మాట్లాడుతున్న తహసీల్దార్

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



అద్దంకి: దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

కొడవలివారిపాలెం (కారంచేడు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తొలి దళిత ముఖ్యమంత్రి, సామాజిక, సమానత్వ న్యాయాల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన మహనీయుడు దామోదరం సంజీవయ్యను స్మరించుకోవడం అందరి బాధ్యతని హెచ్ ఎం ఏ. ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మాట్లాడుతూ సంజీవయ్య.. రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా సేవలందించారని చెప్పారు. కర్నూలు జిల్లాకు చెందిన దామోదరం జయంతి వేడుకలను ఘనంగా జరపడంతో పాటు ఆయన ఆశయాలను, పోరాట ప్రతిమను పాటించాలని సూచించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ తొలిదళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105 జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక రోటరీక్లబ్ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, చిన్ని మురళీకృష్ణ, జాగర్లమూడి శివకుమారి, నర్రా శ్రీలక్ష్మీ, కాకర్ల వెంకటేశ్వర్లు, బాచిన పూర్ణ చంద్రరావు, ఆళహరి హరిప్రసాద్, పుట్టంరాజు తులసీ దాసు, సందిరెడ్డి శ్రీనివాసరావు, తమ్మన శ్రీనివాసరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొడవలివారిపాలెంలో సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం మాఘ మాసం ఉత్తర నక్షత్రం తదియ తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

అద్దంకి రూరల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి 21 వరకు.. తిరిగి 24 నుంచి 28 వరకు ఆయా గ్రామాల్లోని సచివాలయాలో నిర్వహించే ఆధార్ క్యాంపుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెల 18న వెంకటాపురం, శింగరకొండపాలెం, పేరాయపాలెం.. 19న విప్పర్లవారిపాలెం, గోపాలపురం, జార్లపాలెం.. 20న కొంగపాడు, నాగులపాడు, వేలమూరిపాడు.. 21న మణికేశ్వరం, గోవడ, ధేనువుకొండ గ్రామాల్లో.. 24న బొమ్మనంపాడు, ధర్మవరం, కొటికలపూడి.. 25న మైలవరం, శంకరప్పాడు, కుంకుపాడు.. 27న ఉప్పలపాడు, కలవకూరు, తిమ్మాయపాలెం.. 28న వెంపరాల, చక్రాయపాలెం, రామాయపాలెం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

శింగరకొండలో స్వచ్ఛ ఆంధ్ర

అద్దంకి రూరల్: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రా కార్యకమం నిర్వహించనున్నారు. ఈమేరకు శుక్రవారం ఈఓ తిమ్మానాయుడు తెలిపారు. దేవస్థాన సిబ్బంది, సేవకులు పాల్గొన్నాలని కోరారు.

అసోసియేషన్ అధ్యక్షునిగా 'తులాబందు'



బులియన్, జ్యూయలరీ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఇదే..

చీరాల అర్బన్: ది చీరాల బులియన్, జ్యూయలరీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా తులాబందు సురేష్‌బాబు ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక ముంతావారి సెంటర్‌లోని ఎస్‌వీఎస్అండ్ఎస్‌జేఆర్ కళ్యాణ మండపంలో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. చీరాల అధ్యక్షునిగా తులాబందు సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా బర్నికల నాగేశ్వరరావు, కార్యదర్శిగా ఊటుకూరి సత్యనారాయణ, కోశాధికారిగా బొలిశెట్టి నరసింహస్వామి, ఉపాధ్యక్షులుగా పెంటేల మల్లిఖార్జునరావు, వంకా మురళీకృష్ణ, ఉపకార్యదర్శిగా రొండా నాగరాజురెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామనివారు ఈ సందర్భంగా అన్నారు.